# మిత్రభేదం

నారాయణరావుకు నేను చాలా సన్నిహిత మిత్రుణ్ణి. కడచిన ఐదుమాసాల నుంచి నన్ను అన్నివిధాల పోషిస్తున్నాడు. ఉండటానికి తనగదిలో చోటు చూపించాడు; తన ఖాతాలో హోటలు భోజనం ఏర్పాటు చేశాడు. పైగా అప్పుటప్పుడు ఐదూ పదీ అప్పుగా యిస్తూంటాడు కూడాను. ఏ యే ఉద్యోగాలకు అప్లికేషన్లు పెట్టాలో విడమరచి చెబుతూంటాడు. సినిమాలకు లాక్కెళ్తాడు. కాఫీహౌస్‌లో నేనులేంది కాఫీ తాగడు. మిత్రులతో షికార్లకు తీసుకెళ్ళి వాళ్ళకు నన్ను పరిచయం చేస్తాడు. "వీడు మధుసూధనరావు, నా చిన్ననాటి మిత్రుడు, యూనివర్సిటీ చదువుదాకా కలిసే చదువుకున్నాం. ఐదుమాసాలయింది ఈ ఊరొచ్చి! ప్రస్తుతం మన పోషణలోనే వున్నాడు. మంచి ఉద్యోగం ఏదైనా దొరుకుతుందేమోనని చూస్తున్నారు" అంటూ.

నారాయణరావు తన పెళ్ళిరోజున నన్ను అంత ఇదిగా బలవంతంచేసి ఉండకపోయినట్లయితే అసలు నేనిక్కడికి వచ్చి వుండేవాణ్ణి కాదు. "ఉద్యోగానిదేముంది?" అని అరచేతిలో వైకుంఠం చూపించి నన్ను లాక్కొచ్చాడు. నెల గడిచింది. రెండునెలలు గడిచాయి; చూస్తుండగానే ఐదునెలలు రెక్కలు

కట్టుకొని ఎగిరిపోయాయి. "ఏదీ ఆ వైకుంఠం ?" అని అడిగాను. "నా గదిలో కాలం గడపటం నీకు నరకయాతనగా ఉందా ?" అని బదులుప్రశ్న వేశాడు నిజం చెప్పొద్దూ? నాకక్కడ చాలా హాయిగా ఉంది. నారాయణరావుకి మల్లేనే తింటున్నాను, తిరుగు తున్నాను, మంచిబట్టలు వేసుకొని షికార్లకూ, కాఫీలకు వెళ్తు న్నాను. నారాయణరావు అటు ఆఫీసుకు వెళ్ళటంతోటే అతను తెచ్చిపడేసిన పుస్తకాలూ, పత్రికలూ చదువుకుంటూ కాలం గడుపుతాను. ఉద్యోగానికి అప్లికేషన్లు రాసి పడేస్తుంటాను. ఆ తరువాత ఎప్పుడు ఆరుగంటలవుతుందా అని ఎదురు చూస్తాను.

అప్పుడప్పుడు నారాయణరావుకు నేను భారంగా ఉన్నా నేమోనని బాధపడుతూ ఉంటాను. కాని నారాయణరావుకు నేను అలా బాధపడటం సుతరామూ ఇష్టంలేదు. నువ్వు నాకు ప్రాణమిత్రుడి వంటాడు. సాయంత్రం ఆరుగంటలకు విధిగా నేను కాఫీహౌస్‌లో హాజరుకావాలి, లేకపోతే ఊరుకోడు. నేను వెంట లేకపోతే తనకు తోచదు. మా ఉభయులమధ్యా ఇంత మైత్రి ఉంది.

ఒకరోజున పోస్టుమేన్ అందించివెళ్ళిన నీలంరంగు కవరు చించజోయా 'అవునుగాని మధూ! అసలు నీకూ! శశికీ ఎప్పుడో పెళ్ళికావలసింది కదా ? మరి కాలేదేం ?" అన్నాడు. "నాకు ఉద్యోగంలేదు, ఆస్తిపాస్తులు అంతకంటే లేవు, పెళ్ళికి ఇవి అవాంతరాలు కావచ్చునుగా !" అన్నాను నేను. "ప్రేమకు ఇవేవీ అడ్డురాకూడదు. శశి వీటిని ఎందుకు ఎదుర్కోలేక

పోయిందో ఆశ్చర్యంగా వుంది" అని కనుబొమలు చిట్లించాడు నారాయణరావు.

ఆ మరోక్షణాన శశి నా స్మృతిపథంలో మెదిలింది. ఇక్కడికొచ్చాక కూడా నాలుగుమాసాలు ఉత్తరాలమీద ఉత్తరాలు రాసింది. కాని పెళ్ళివిషయం తెలిసిన రోజున ఆ ఉత్తరాలన్నిటినీ తగలబెట్టేశాను. అంతే!

నారాయణరావుకు భార్య ఉత్తరం అందినరోజున అతని ఆనందానికి మేరవుండదు. మురిసిపోతూ "ఇది మా ఆవిడ రాసిన ఉత్తరం" అన్నాడు.

నిజంగా నారాయణరావు భార్య అందంలో రంభలాగా ఉంటుంది. పెళ్ళిరోజున ఆమె లావణ్యాన్ని చూసి ఆశ్చర్య పోయాను. తన స్నేహితులందర్నీ నారాయణరావు వరుసగా పరిచయం చేసినప్పుడు ఆమె ఎంత మనోహరంగా అందరి మొహాలవైపు చూసి ఎంత నిండుగా నవ్వింది! తొలిపూత గులాబీలకుమల్లే వున్న ఆమె చెంపలు ఎంత చక్కగా సిగ్గులు తేలాయి? ఇతరుల విషయం నాకు తెలీదుగాని - నామటుకు నేను ఆమెనుచూసి చాలా ఈర్ష్య పడ్డాను.

మొదట్లో "ఇది మా ఆవిడ ఉత్తరం" అని చెప్పినప్పుడు నాకుకూడా చాలా సంతోషంగా ఉండేది. కాని ఇటీవల ఒక నెలరోజులుగా ఆమాట చెప్పినప్పుడు తెలీనిబాధ నా మనస్సును ఆవరించి రకరకాలుగా ఆలోచించేట్టు చేస్తున్నది.

నారాయణరావు రోజూ ఉదయం పదింటికి బయలుదేరు తాడు ఆఫీసుకు. అలా బయలుదేరటానికి ముందు పోస్టుకోసం ఎదురుచూస్తాడు. భార్య దగ్గరనుంచి వారానికో కవరు వస్తుంది.

నీలంరంగు కవరు! విప్పారిన మొహంతో కవరు అందుకొని ఆనందంతో నారాయణరావు ఆఫీసుకు వెళ్ళిపోతాడు. నేను వాకిట్లో నిలబడి అతన్ని మలుపుతిరిగేదాకా చూస్తాను. ఆ నడకలలో ఎంత ఉత్సాహం!

నాకు తెలుసు. ఆ ఉత్తరంలోని ప్రతిపంక్తీ అతనికి ఒక అనిర్వచనీయమైన ఆనందానుభూతిని ప్రసాదిస్తుంది. ఎన్నెన్నో ప్రణయభావాలను మోసుకొచ్చి అందిస్తుంది. ఒకప్పుడు శశి రాసిన ఉత్తరాలు చదువుకొని నేనుకూడా ఇలాగే ఆనందించిన రోజులు లేకపోలేదు. శశి నా అందాలభరిణె! నాకు దూరమైంది. ఎన్ని ఉత్తరాలు రాసింది! ఎన్నెన్ని సంగతులు నాకు చెప్పింది. ఆ ఉత్తరాలు ఏవీ? ఆ శశిఏదీ? అచ్చంగా నారాయణరావు భార్య ఉపయోగించే నీలంరంగు కవర్లు ఆమెకూడా ఉపయోగించేది.

ఇప్పుడు పోస్టుమేన్ వస్తున్నాడు. వెళ్తున్నాడు, నారాయణరావుకు వారానికో నీలంరంగు కవరుమాత్రం అందించి వెళ్ళిపోతున్నాడు. అంతే! పోస్టుమేన్ కూడా ఈమధ్య నారాయణరావు చూసినట్టే చూస్తున్నాడు. వీళ్ళచూపులు భరించటం కష్టంగా వుంది. అందుకని పెరట్లోకి వెళ్ళి, పిచ్చిపిచ్చిగా పెరిగిన చెట్లనూ, చెట్లమీద ఏదో ప్రపంచం మునిగి పోతున్నట్లు కిచకిచలాడే రకరకాల పక్షుల్నీ చూస్తూ ఉండిపోతాను.

రోజులు గడుస్తున్నాయి. నారాయణరావు ఎప్పటికి మల్లేనే ఉదయం పదింటికి ఆఫీసుకెళ్లి సాయంత్రం ఆరింటికి నేరుగా కాఫీహౌస్ కొస్తున్నాడు. మామూలు ధోరణిలోనే

కబుర్లు సాగుతున్నాయి. సినిమాలకు వెళ్తున్నాం, షికార్లకు నడుస్తున్నాం. అన్నీ చూస్తున్నాం. దేంట్లో మార్పు లేదు.

కాని నాకే బాగుండటంలేదు. ఏదో వెలితిగా ఉంది.

'పోస్టు' అని కేకేసి పోస్టుమేన్ నాచేతికి రెండు ఉత్తరాలు అందించి వెళ్లిపోయాడు. ఒకటి నాది, రెండోది నారాయణరావుది. నాకు వచ్చిన కవరు బుక్ పోస్టు – ఏదో వివాహ ఆహ్వానపత్రిక. అవతల పడేశాను. రెండోది నీలంరంగు కవరు. నారాయణరావు భార్య రాసిన నీలంరంగు కవరు!

ఒకప్పుడు శశికూడా ఇలాంటి కవర్లు రాసేది.

ఎందుకో నాగుండె ఒక క్షణంపాటు దడదడ కొట్టుకుంది.

నారాయణరావు స్నానం ముగించుకొని గదిలోకి వచ్చి రావటం తోంటే– "పోస్టుమేన్ వచ్చాడుకదూ ?" అని అడిగాడు.

"వచ్చాడు! నీకేమీ ఉత్తరాలు రాలేదు. నాకుమాత్రం ఓ బుక్ పోస్టు కవరు వచ్చింది అంతే" అన్నాను.

నారాయణరావు టీపాయ్ మీదున్న నాకు వివాహ ఆహ్వానపత్రిక ఒక పర్యాయం చూసి మళ్ళీ అక్కడే పడేశాడు.

నారాయణరావు బట్టలేసుకుని ఆఫీసుకు బయలుదేరి వెళ్లిపోయాడు. మలుపు తిరిగేదాకా చూశాను. ఆ నడకలో వెనుకటి ఉత్సాహము లేదు.

నా జేబులో దాగి ఉన్న నారాయణరావు భార్య రాసిన నీలిరంగు కవరు బయటికితీసి చూశాను. ఒక రెప్పపాటు కాలంలో కళ్ళ ఎదుట ఏవేవో మెదిలాయి. చెవులకు అతి

సన్నగా సన్నాయి చివరస్వరంలా ఏవో వినిపించాయి. మరో క్షణాన-నాముందు పెళ్ళిరోజున పూచిన తంగేడల్లే ఒంటెనిండా నగలతో, వయ్యారినడకతో - నవ్వుకుంటూ, కలకలలాడుతూ, కన్పించిన నారాయణరావు భార్య మొహం - కలగా కన్పించి ట్లయింది.

ఎందుకో బాధవేసింది నాకు !

కాని నేను దాన్ని ఖాతరు చెయ్యలేదు. తలుపు మూసి పెరట్లోకి వెళ్ళాను. నీలంరంగు కవరూ నాచేతిలో వుంది. అది ఒక భార్య తన భర్తకు రాసిన ప్రణయలేఖ-అందులోనూ ఇటీవలే తలచి వలపించుకున్న జవరాలు రాసిన ప్రేమలేఖ. మనస్సు బిగబట్టుకొని చదివాను ఆ సాంతంగా ! నేను పొందిన ఆనందాన్ని వర్ణించటానికి ఏ కవీ చాలడు.

ఆ ఉత్తరం చదివినంతసేపూ నాకు శశి గుర్తుకురానేలేదు. శశి ఉత్తరాలకూ, ఈ ఉత్తరానికీ అసలు సామ్యమేలేదు. ఈ ఉత్తరం చదివితే కలిగే ఆనందం వేరు. ఊహకూ వాస్తవానికీ ఉన్న తేడాయే ఈ రెంటిమధ్యా ఉన్నది.

ఆరుగంటలకల్లా ఆ కాఫీహౌస్ కెళ్ళి లోపల గదిలో, మూలగా కిటికీదగ్గర - రోజూ కూర్చునేచోట కూర్చున్నాను. నారాయణరావు వచ్చాడు. అతణ్ణి చూడగానే ఎందుకో నాకు కొంచెం భయంలాంటిది వేసింది. కాని వెంటనే తెప్పరిల్లుకొన్నాను. అతను మాత్రం మామూలుగానే ఉన్నాడు. రోజుటి మాదిరిగానే కబుర్లు చెప్పుకున్నాం. ఆ తరువాత నిత్య కార్యక్రమం ప్రకారం నాలుగురోడ్ల కూడలిదగ్గర నిలబడి రక రకాల కాంతుల్ని, ఆ కాంతుల పక్కగా నడిచివెళ్ళే రక రకాల మను

షుర్ల్నీ చూస్తూ కొంతసేపు గడిపాం. నెమ్మదిగా హోటలు భోజనం. గది మళ్ళీ కబుర్లు.

ఆరోజురాత్రి నారాయణరావు చాలా కబుర్లు చెప్పాడు-అన్నీ తన భార్యను గురించిన కబుర్లు! ఉత్తరం రానందుకు బాధపడ్డాడు.

అన్ని కబుర్లూ చెప్పి నారాయణరావు మామూలుగానే నిద్రపోయ్యాడు.

కాని నాకుమాత్రం ఆరాత్రి నిద్రపట్టలేదు. ఇంత మిత్ర ఘాతుకానికి పాల్పడ్డ నాకు నిద్రెలాపడుతుంది? గత ఐదు మాసాలనుంచి నన్ను సర్వవిధాలా పోషిస్తున్నాడు. కావాలని నన్ను తనదగ్గర తెచ్చి పెట్టుకున్నాడు—అన్ని హంగులూ అమర్చాడు. అలాంటి మిత్రుణ్ణి ఈ విధంగా మోసం చెయ్యటం బాధకరమైన విషయం కాదూ మరి? ఎంత మహాపరాధం చేశాను? చేసిన తప్పు ఒప్పుకుంటే మనస్సుకు ఊరట కలుగుతుందంటారు! నారాయణరావు ఈ అపరాధాన్ని మన్నించక పోడు! ఉదయం కావటంతోనే అతని ఉత్తరం అతనికి ఇచ్చి వేస్తాను!

ఇలా అనుకున్నాకగాని నాకు నిద్రపట్టలేదు.

తెల్లవారింది. కాని రాత్రి అనుకున్న విధంగా చేయటానికి మాత్రం నాకు సాహసం చాలిందికాదు.

ఆ ఉత్తరం ఇచ్చేస్తే ఎలాగు?

అలాంటి మధురానిభూతిని మరల నాకెవరు ప్రసాదిస్తారు?

నారాయణరావు పోస్టుమెన్ వచ్చే దాకా ఉండి వెళ్ళిపోయ్యాడు. నిన్నటిలాగానే నిలబడి నేను అతన్ని — మలుపు తిరిగేదాకా చూశాను. నడకలో ఉత్సాహం లేదు. కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్నాడు.

ఆ రోజంతా నేను నారాయణరావును గురించే మథన పడ్డాను. నా చర్యను నేనే నిరసించుకున్నాను. బాధపడ్డాను. నరాల్ని పీకే బాధ! ఆ బాధను భరించ లేక పోయాను. చివరి సారిగా ఆ ఉత్తరాన్ని మరల చదువుకున్నాను.

రోజుటి కంటే ఆ రోజు కొంచెం ముందుగా కాఫీ హౌస్ కెళ్ళాను. ఎప్పుడు లేంది నారాయణరావు కూడా ఐదున్నరకే వచ్చి కూడ కూర్చున్నాడు.

"నీ కోసమే చూస్తున్నాను రా మధూ! నాలుగు రోజులు శెలవు పెట్టాను. ఈ రాత్రి బండికే బయలుదేరి వెళ్ళాలని ఉంది!" అని అన్నాడు, నారాయణరావు.

"ఎక్కడికి?" అన్నాను నేను అప్రయత్నంగానే!

"ఇంకెక్కడికి మా ఆవిడను చూసి రావడానికి!" అని అన్నాడు నారాయణరావు.

నారాయణరావుకు తన భార్యమీద ఎంత ప్రేమున్నదో నాకు అప్పుడుగాని తెలీలేదు, సంపూర్ణంగా! ఎంత ఆదర్శ దాంపత్యం వీళ్ళది! ఉభయుల మధ్య ఎంత సామీప్యం?

ఈ సామీప్యాన్ని దూరంచేయటానికి ప్రయత్నించాను నేను! ఎంత అపచారం?

నా జేబులో నారాయణరావు భార్య నీలం కవరు నేను కదిలినప్పుడల్లా అదో విచిత్రమైన ధ్వనిని కల్గిస్తున్నది. రెక్కలు విప్పి ఎగరటానికి సిద్ధంగా వున్న పక్షికి మల్లే!

"తప్పకుండా వెళ్ళవలసిందేనా?" అన్నాను నేను, నారాయణరావు కళ్ళలోకి చూస్తూ! అతను చెప్పకుండానే నాకు అతని కళ్లు కారణాలు-వెయ్యి విధాలుగా వివరించి చెబుతున్నాయి. కిటికీలో గుండా అతను బయటికి చూస్తున్నాడు. బయట పక్కగా పూలచెట్ల పూ రేకులు పచ్చని ఆకులమీదుగా కిందికి రాలుతున్నాయి.

నా వేపు చూసి ఏదో చెప్పబోయే నారాయణరావును నేను వారించి-

"జీవితంలో స్నేహితులమధ్య అనుకోకుండా ఊహించటానికి వీల్లేని పెద్దపెద్ద తప్పిదాలు జరిగిపోతుంటాయికదూ?" అని అన్నాను, అసలు విషయానికి ఉపోద్ఘాతంగా.

"అవును మరి! మనం మానవమాత్రులంగనక తప్పదు!" అన్నాడు నారాయణరావు, నేను బహిర్గతం చేయాలనుకుంటున్న రహస్యాన్ని తెలుసుకున్న వాడికిమల్లె!

"చేసిన తప్పు ఒప్పుకోనడం జరిగితే అవతలి వ్యక్తికి కొంత ఉపశమనంగా ఉంటుందికదూ?" అన్నాను నేను; కొంచెం తేలికపడిన మనస్సుతో!

"అవునా, మధూ! ఇది అక్షరాలా నిజం! నీ అభిమతం నా కర్థమైంది. జీవితంలో కొన్ని పనులు మనకు తెలీకుండానే జరిగిపోతున్నాయి. వాటిని మనం బుద్ధిపూర్వకంగా ఆచరించం! ఇది మానసిక దౌర్బల్యం కావచ్చు!...నన్ను క్షమిస్తే నీకో

విషయం చెబుతాను!" అన్నాడు నారాయణరావు నా వైపు చూస్తూ!

నారాయణరావు మాటలు నా కర్థంకాలేదు. ఏమి టన్నట్లు అతని వైపు చూశాను. అలా చూసి కాఫీ సిప్ చేశాను. ఎప్పుడూ లేని రుచి ఎందుకో కాఫీకి ఆనాడు వచ్చింది. బయట వరబారి పూసిన పువ్వుల పరిమళం లోపలి కొచ్చి నా కెందుకో ఆనందాన్ని కల్గిస్తోంది.

పేంటు జేబులో ఉన్న నారాయణరావు భార్య నీలం రంగు కవరు పైకి తీశాను.

నారాయణరావు చెప్పుకు పోతున్నాడు—

"నెలరోజుల క్రితం నువ్వు ఒక ఉద్యోగానికి ఇంట ర్వ్యూకు వెళ్ళిన రోజున—నీకో ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం శశి రాసింది. పోస్టుమెన్ అందించి వెళ్ళిన ఆ ఉత్తరాన్ని నేను నీ కివ్వకుండా చించి చదివి నా దగ్గరే దాచి పెట్టుకున్నాను. నీ కివ్వలేదు. అంత మంచి ఉత్తరం జీవితంలో నేను పొంద గలనో లేదోనని—జాగ్రత్త చేసుకున్నాను. నీపట్ల నేను మహాప రాధం చేశాను. నన్ను క్షమించవ్ మధూ!"

నారాయణరావు మహాపరాధం చేసినవాడికి మల్లె! నా రెండు చేతులూ పుచ్చుకున్నాడు, బతిమలాడుతున్నట్టుగానే

"నిజంగానా?" అన్నాను పట్టుకపోతున్న గుండెను అదిమి పట్టుకుంటూ!

"నిజంరా మధూ!" అన్నాడు నారాయణరావు పొడి ఆరుతున్న గొంతుతో!

"అయితే నారాయణరావూ...మరో విషయం..." అని చెబుతున్న నన్ను వారిస్తూ—

"నువ్వేమీ చెప్పొద్దు !...క్షమించానని మాత్రం అను! అంతే !" అని నా మొహంలోకి చూస్తూ అన్నాడు.

నేను తల దాచేసుకున్నాను. నేను చెప్పాలనుకున్న విషయం పెదవుల మీాదనే ఉండిపోయింది. నారాయణరావు భార్య నీలంరంగు కవరు మళ్ళీ నా పేంటుజేబులో పెట్టుకున్నాను. అంతే !—(ఆలిండియా రేడియో ప్రసారితం)